## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ పురోగతిలో గిరిజనుల భాగస్వామ్యం ఉన్నప్పుడే భారత్ సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ కృషి చేస్తోందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు.
- ❖ స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో శాంచెజ్ రేపటి నుండి 3 రోజుల పాటు భారత్ లో పర్యటించనున్నారు.
- ❖ ప్రపంచ దక్షిణాది దేశాలు సాధిస్తున్న పురోగతి దృష్ట్యా పరస్పర ఆవిష్కరణల మార్పిడిని ప్రోత్సహించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రపంచ బ్యాంకుకు పిలుపునిచ్చారు.

======================

గిరిజనుల జీవనశైలి నుండి నేర్చుకోవడం ద్వారా దేశం సుస్థిర అభివృద్ధికి కృషి చేయవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భిలాయ్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ... అభివృద్ధి ప్రక్రియలో గిరిజనుల భాగస్వామ్యం ఉన్నప్పుడే దేశం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

(వాయిస్ 28 సెకన్లు)

అలాగే ఈ సందర్భంగా రాష్ట్రపతి ఏడుగురు విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ డేకా, ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి పాల్గొన్నారు.

======================

స్పెయిన్ అధ్యక్షులు పెడ్రో శాంచెజ్ 3 రోజుల పర్యటన నిమిత్తం రేపు భారత్ కు రానున్నారు. ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా పెడ్రో శాంచెజ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రతినిధి స్థాయి చర్చలు జరుపుతారు. ఎయిర్ బస్ స్పెయిన్‌తో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్న సీ-295 ఎయిర్‌క్రాఫ్ట్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్‌ను వడోదరలో ఇరువురు ప్రారంభిస్తారు. అలాగే విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తో కూడా స్పెయిన్ అధ్యక్షులు సమావేశమవుతారు.

======================

సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ కృషి చేస్తోందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ఈరోజు ఆయన ఐఐటి ఢిల్లీ స్నాతకోత్సవంలో మాట్లాడుతూ... అంతరిక్ష రంగం యొక్క అనువర్తనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దీని ప్రభావం పెరుగుతుండటంతో అంతరిక్ష రంగం ఇప్పుడు కీలకంగా మారుతోందని అన్నారు. అందుకే ప్రభుత్వం ఇటీవల అంతరిక్ష రంగంలో మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులను తీసుకువస్తుందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

డిజిటల్ ఇన్ క్లూజన్, సుస్థిర ఇంధన రంగాల్లో ప్రపంచ దక్షిణాది దేశాలు సాధిస్తున్న పురోగతి దృష్ట్యా పరస్పర ఆవిష్కరణల మార్పిడిని ప్రోత్సహించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రపంచ బ్యాంకుకు పిలుపునిచ్చారు. వాషింగ్టన్ డీసీ లోని వరల్డ్ బ్యాంక్‌లో జరిగిన వార్షిక సమావేశాల సందర్భంగా "ఎ ఫ్యూచర్ - రెడీ వరల్డ్ బ్యాంక్ గ్రూప్" అనే అంశంపై జరిగిన డెవలప్‌మెంట్ కమిటీ ప్లీనరీ సెషన్‌లో ఆర్థిక మంత్రి ఈ ప్రకటన చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య విస్తృత భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ఋణ సదుపాయాలను మరింత ప్రోత్సహించాలని అన్నారు.

======================

వివిధ రాష్ట్రాల్లోని 47 అసెంబ్లీ నియోజకవర్గాలకు, కేరళలోని వాయనాడ్ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. ఉత్తరప్రదేశ్‌లో 9, రాజస్థాన్‌లో 7, పశ్చిమ బెంగాల్‌లో 6, అస్సాంలో 5, బీహార్, పంజాబ్‌లో 4, కర్ణాటకలో 3, మధ్యప్రదేశ్‌లో 3, కేరళలో 2 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సిక్కింతో పాటు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మేఘాలయలో ఒక్కో స్థానానికి అసెంబ్లీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. అదే రోజు వాయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది. మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానానికి, ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ స్థానానికి నవంబర్ 20వ తేదీన ఉప ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

విరామం

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

=======================

ప్రపంచ దక్షిణాది దేశాలు భారత్ పై నమ్మకం, ఆశలు పెట్టుకున్నాయని  విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈరోజు ఆయన పుణెలోని ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో పరస్పరం మాట్లాడుతూ... భారత్ పై ఆ దేశాలు నమ్మకం పెట్టుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, అందులో ప్రధానంగా మాట్లాడుకున్నట్లయితే.. కోవిడ్ సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు వాస్తవానికి వ్యాక్సిన్లను నిల్వ చేసుకుంటున్న సమయంలో భారత్ దక్షిణాది దేశాలకు ముందుగా వ్యాక్సిన్లను అందించిందని గుర్తు చేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

ఒడిశాలో తీరప్రాంత జిల్లాల్లోని “దానా” తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస, పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 'దానా' తుఫాను నిన్న రాత్రి ఒడిశా తీరంలోని భితార్కానికా నేషనల్ పార్క్, ధామ్రా మధ్య తీరాన్ని తాకింది. తుఫాను ఇప్పుడు ఒడిశాలోని ఉత్తర ప్రాంతాలలో అల్పపీడనంలా కేంద్రీకృతమైందని, రానున్న 6 గంటల్లో ఇది మరింత బలహీన పడుతుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఈ తుఫాను కారణంగా ఒడిశా రాష్ట్రంలో 2.8 లక్షల హెక్టార్లకు పైగా వ్యవసాయ భూమి నీటిలో మునిగిపోయిందని, 1.75 లక్షల హెక్టార్లలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. “దానా” తుపాను వల్ల ఇళ్లు కోల్పోయిన ప్రజలకు పక్కా గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, తుపాను ప్రభావిత జిల్లాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా చేపడుతోంది.

=======================

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (CBDT)- 2024-25 అసెస్మెంట్ సంవత్సరానికి కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులు ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడానికి గడువును పొడిగించింది. గతంలో ఇచ్చిన ఈనెల 31 ఆఖరి తేదీని ఇప్పుడు నవంబర్ 15 వరకు పొడిగించింది.

=======================

న్యూఢిల్లీలో నవంబర్ 18 నుంచి 22వ తేదీ వరకు జరగాల్సిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్ ఇండియన్ ఆర్మీ), బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (BGB) మధ్య డైరెక్టర్ జనరల్ స్థాయి సరిహద్దు చర్చలు వాయిదా పడ్డాయని అధికారులు తెలియజేశారు.

=======================

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ “స్వచ్చతా అభియాన్”ను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రారంభించారని కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. ఈరోజు భోపాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబి) నిర్వహించిన “వార్తాలాప్” “పరిశుభ్రత దశాబ్దం, స్వచ్ఛ భోపాల్‌కు ప్రత్యేక చొరవ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. “స్వచ్ఛతా అభియాన్” ప్రచారంలో అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని.. ఇది చాలా శుభ పరిణామమన్నారు. పరిశుభ్రత మన జీవన శైలిలో ఒక భాగమవ్వాలని కేంద్ర సహాయ మంత్రి పేర్కొన్నారు.

=======================

వరల్డ్ టేబల్ టెన్నిస్ ఛాంపియన్స్ టోర్నమెంట్లో క్వార్టర్ ఫైనల్ కు అర్హత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా మనికా బాత్రా చరిత్ర సృష్టించింది. ఫ్రాన్స్ లోని మోంట్పెల్లియర్ లో జరిగిన రౌండ్ ఆఫ్ 16లో భారత క్రీడాకారిణి మనికా బాత్రా 3-1 తేడాతో బెర్నాడెట్ స్జోక్స్ పై విజయం సాధించింది. ఈరోజు తన తదుపరి మ్యాచ్ ను చైనా క్రీడాకారిణి కియాన్ తియానీతో ఆడనుంది.

=======================

=======================